క్లుప్తంగా

భరత్ గెలవాలని దీక్ష

రామకుప్పం: వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా భరత్ గెలవాలని కుప్పం మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ లలిత ఆధ్వర్యంలో మహిళలు ఓం శక్తి మాల ధరించి దీక్ష చేపట్టారు. మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ గోవిందపల్లి వాసులు ఓం శక్తి మాల ధరించి అమ్మవారి దర్శనానికి బయలుదేరారు.

తెలుగును రక్షించుకుందాం

పుంగనూరు: పరాయి భాషపై వ్యామోహంతో తెలుగు భాషను మరిచిపోతున్నారని, తేనెలొలుకు తెలుగు భాషను పరిరక్షించుకుందామని తెలుగు సాహితీ వికాస సమితి అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బసవరాజ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనం, విలువలపై అవగాహన కల్పించారు. తెలుగు భాషను వినియోగిస్తే ఎన్నో ఉపయోగాలు కలుగుతాయన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: కర్ణాటక సరిహద్దులోని రాజుపల్లి చెక్‌పోస్టులో శనివారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా అప్పినపల్లికి చెందిన అలివేలమ్మ బ్యాగులో కర్ణాటక మద్యం ఉండగా పట్టుకున్నట్టు తెలిపారు. 24 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పదవ తరగతి కీలకం

రొంపిచెర్ల: విద్యార్థులకు పదవ తరగతి కీలకమని కళ్యాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన శనివారం రొంపిచెర్ల కేజీబీవీలో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లల కోసం ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తోందని, మంచి మార్కులు సాధించాలని కోరారు. ఎస్‌వో సుజాత, కళ్యాణ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దుర్గ

కుప్పం రూరల్: కుప్పం ప్రజలకు నిరంతరం అండగా ఉంటామని ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ తెలిపారు. ఆమె శనివారం కుప్పం మండల కొటాలూరు పంచాయతీలో ప్రజలకు పసుపు, కుంకుమ, చీర పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కుప్పం నుంచి 35 ఏళ్లుగా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి లేదన్నారు. పేదల బతుకుల్లో మార్పు లేదన్నారు. తన భర్త భరత్‌కు ఒక్క అవకాశం ఇస్తే మార్పు చేసి చూపిస్తామన్నారు.

పింఛన్ల పెంపుతో అవ్వాతాతలకు భరోసా

- పింఛన్ల పెంపు, పంపిణీలో ఏపీ దేశంలోనే అగ్రస్థానం
- మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన చంద్రబాబు
- ఎమ్మెల్యే వెంకటేగౌడ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు



పుంగనూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న అలీమ్‌బాషా, నాగభూషణం

గంగవరం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పింఛను మొత్తం పెంచి అవ్వాతాతలకు భరోసా కల్పించారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం పెంచిన పింఛను మొత్తం, కొత్త పింఛన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో పేదల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పింఛను మొత్తాన్ని రూ.3 వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మేరకు మొదటి ఏడాదిలోనే రూ.2 వేల నుంచి రూ.2,250లకు పెంచారని తెలిపారు. ప్రస్తుతం రూ.3 వేలకు పెంచారని తెలిపారు. మండలంలో గత నెల వరకూ 8,340 మంది లబ్ధిదారులు ఉండగా నేడు 8,440 మంది చేరారని వెల్లడించారు. వారికి నెలకు రూ.2.59 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదని, నేడు 1వ తేదీ ఉదయమే వలంటీర్లు ఇంటి తలుపుతట్టి నగదు అందజేస్తున్నారని వివరించారు.

అధికారం కోసం టీడీపీ కుట్రలు

అధికారం కోసం చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. అనుభవజ్ఞుడని 2014 ఎన్నికల్లో అధికారం ఇస్తే దోచుకోవడం, దాచుకోవడం చేశారని, ప్రజలకు కష్టాలు, బాధలే మిగిల్చారని పేర్కొన్నారు. 600 హామీలు ఇచ్చి మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించారని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ అని చెబుతూ మరోసారి మోసం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ అబద్ధపు హామీలను నమ్మి మోసపోవద్దని పులుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, జెడ్పీటీసీ పార్వతి, సర్పంచ్ చంద్రమ్మ, చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ అమర్నాథ్ పాల్గొన్నారు.

మొదటి రోజు 91 శాతం పెన్షన్ల పంపిణీ

కుప్పం రూరల్: కుప్పం మండలంలో శనివారం ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ప్రతి లబ్ధిదారునికి ఈ నెల నుంచి రూ.3 వేలు ఇచ్చే ప్రక్రియను మొదలుపెట్టారు. మొదటి రోజే 91 శాతం పెన్షన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఖాదర్‌బాషా తెలిపారు. మిగిలిన వారికి ఆది, సోమవారాల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

సోమలలో..

సోమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లు పెంచి అవ్వాతాతలకు భరోసా కల్పించారని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సోమలలో రూ.3 వేల పింఛను పంపిణీ చేశారు. అనంతరం కలికిరి మార్గంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న బస్టాప్ పనులు పరిశీలించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల హరినాథ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

పుంగనూరు: మున్సిపాలిటీలో శనివారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం ఆధ్వర్యంలో నూతన పెన్షన్ల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి నెలా 5,547 మందికి రూ.1.55 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 82 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లలిత, వైఎస్సార్ సీపీ సీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్లు కాంతమ్మ, గంగులమ్మ, కిజర్‌ఖాన్, అర్షద్‌అలి, సాజిదాబేగం, కాళిదాసు, జెపి.యాదవ్ పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు గెలిచి సీఎం కావాలని, కుప్పం ఎమ్మెల్యేగా భరత్ గెలవాలని కోరుతూ కుప్పం మండలం దాసేగానూరుకు చెందిన యువకులు శబరిమలైలో ప్రత్యేక పూజలు చేశారు. వారు గురువారం ఇరుముడి ధరించి గ్రామం నుంచి బయలుదేరి శనివారం ఉదయం శబరిమలై చేరుకున్నారు. అక్కడ సీఎం జగన్, భరత్ బ్యానర్‌ను ప్రదర్శించారు.

కుర్చీల వితరణ

సదుం: మండలంలోని రెడ్డివారిపల్లె వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు శనివారం స్థానిక సర్పంచ్ హనుమంతరెడ్డి కుర్చీలు వితరణ చేశారు. ప్రభు త్వం పేదల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, హెల్త్ క్లినిక్‌లు గ్రామీణులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సబ్సిడీతో మినీ ట్రాక్టర్

పలమనేరు: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల అందుబాటులోకి వచ్చిన మినీ ట్రాక్టర్ రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద కార్యదర్శి సంజీవకుమార్‌తో కలిసి శనివారం మినీ ట్రాక్టర్‌ను నడిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రూ.లక్ష సబ్సిడీతో మినీ ట్రాక్టర్లను అందజేస్తోందని తెలిపారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి

రామకుప్పం: మండలంలోని మిట్టపల్లి వాసులకు మిట్టపల్లి సమీపంలో ఇంటి స్థలాలు కేటాయించాలని జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును చిత్తూరులో కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సర్వే నెంబరు 5/1లో అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్ మురళిని ఆదేశించారు. సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, నేతలు మధు, ప్రకాష్, రవి, పవన్, శేషాద్రి పాల్గొన్నారు.

పూతకు ముందే మందుల పిచికారీ

పులిచెర్ల(కల్లూరు) : మామిడి చెట్లలో పూత రావడానికి ముందే మందులు పిచికారీ చేయాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల రైతులకు మామిడి పూత దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పూత బాగా నిలవడానికి లీటరు నీటిలో 8 గ్రాముల ఆర్గామాంగో స్పెషల్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

పలమనేరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం వాణివిద్యాశ్రమలో పిల్లలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాతి పండుగ విశిష్టతను పిల్లలకు వివరించారు.

రూ.25 వేల సాయం



పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ చిన్నపేట కురప్పల్లికి చెందిన సౌందర్‌రాజన్(51)కి మధుమేహంతో కాలు తొలగించారు. వేలూరు సీఎంసీలో కృత్రిమ కాలు అమర్చేందుకు రూ.40 వేలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రంగినాయనిపల్లికి చెందిన రామచంద్రనాయుడు శనివారం రూ.25 వేలను సాయం చేశారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ రంగారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ గ్రామానికి చేరుకుని రంగారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఇంద్రప్ప, ప్రభాకర్ రెడ్డి, సుగుణప్ప, శ్రీనివాసులు రెడ్డి, చెంగల్రాయ రెడ్డి పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి సేవకుడిలా పనిచేస్తా..



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

కుప్పం: కుప్పం ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే ఇంటి బిడ్డగా సేవ చేస్తానని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. కుప్పంలో శనివారం పెంచిన పింఛను మొత్తం పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా చంద్రబాబును గెలిపిస్తున్నారని, ఒక్క రోజైనా ఎమ్మెల్యేగా చంద్రబాబు మీతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారా అని ప్రశ్నించారు. 35 ఏళ్ల అభివృద్ధి 5 ఏళ్లలో చేస్తామని ప్రగల్భాలు పలికి ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేశారని, పది రోజుల్లో కుప్పానికి నీటిని తీసుకువస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పుంగనూరు వరకు హంద్రీనీవా కాలువను పూర్తి చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయినందుకు చంద్రబాబునాయుడు సిగ్గుపడాలన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ 35 ఏళ్లు కుప్పంలో పాతుకుపోయినా చంద్రబాబు ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదని, మరోసారి ఆయన మాటలు విని మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యావేత్త భరత్‌ను గెలిపిస్తే కుప్పం ప్రజలకు నిరంతరం సేవకుడిలా పనిచేస్తారని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతున్న సుధీర్ రెడ్డి

సోమల: యువత క్రీడల్లో రాణించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావుతో కలిసి స్థానిక ఎస్‌వీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో షావలీ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మూడేళ్లుగా తన తండ్రి పేరిట క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న షావలీని అభినందించారు. ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు మాట్లాడుతూ క్రీడా మైదానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రభాకర, మాజీ ఎంపీటీసీ వసంతమ్మ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నవీన్‌కుమార్ రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, అన్ను, ఐలాసూరి, వేముల హరినాథ, జయరాం, శ్రీరాములు, జిలానీ, రస్నా, మస్తాన్ వలి, అబ్రరర్, ముభారక్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

మండలంలో అభివృద్ధి పరుగులు

వి.కోట: మండలంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీపీ యువరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అభివృద్ధిలో వి.కోట మండలం మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, సీఐ లింగయ్య, ఎంపీడీవో మాహ్మద్ రఫి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ గౌస్, మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీరాములురెడ్డి, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం ఆవిష్కరణ

పుంగనూరు: పట్టణ సమీపంలోని భీమగానిపల్లె బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించి సర్కిల్‌ను ప్రారంభించనున్నారు. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజసేవా సంఘం, (కాప్‌రాక్స్) బలిజ యువత ఆధ్వర్యంలో కృష్ణదేవరాయల సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కాప్‌రాక్స్ సభ్యులు కనకదుర్గ సత్యనారాయణ, సుబ్బరాయప్ప, శివకుమార్, మంజు, మనోహర్, నరేంద్ర, పీవీ రమణ, కుమార్, గోపి తదితరులు పరిశీలించారు.

ప్రయాణికులకు బహుమతులు

పుంగనూరు: పుంగనూరు డిపో నుంచి దొడ్డిపల్లి, తిరుపతి, రాయచోటి, ముళబాగిల్ రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. ఆయన శనివారం శంకర్, సూర్యప్రకాష్, ఆంజనేయులు, రెడ్డెప్ప, హరినాథ్, అఫ్సర్‌కు బహుమతులు అందజేశారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలు వీరే

పలమనేరు: చౌడేపల్లి రోడ్డులో ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన వారు గిఫ్ట్‌బాక్స్‌లో వేసిన టికెట్లను స్థానిక డిపోలో డీఎం స్వామి శనివారం లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఇందులో రామక్రిష్ణయ్య, రెడ్డెమ్మ, హరినాథ్ ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరు స్థానిక డీఎం కార్యాలయంలో సంప్రదించి బహుమతులు పొందవచ్చునని తెలిపారు.